


పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం
పేదల ఆరోగ్యం విషయంలో ఎంత వ్యయం చేసేందుకైనా జగనన్న ప్రభుత్వం సిద్ధంగా ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు.
-8లో



బ్రహ్మోత్సవం చూతము రారండి.!
ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రముఖ శైవ పుణ్య క్షేత్రమయిన హత్యరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి ప్రారంభం కానున్నాయి.
-8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.6/23.3
జిల్లాలో ఆదివారం 23.3 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

6న జనరల్ బాడీ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సీపీఐ ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర పేర్కొన్నారు. ఆదివారం కడపలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కడపలోని రహమతియా ఫంక్షన్ హాల్‌లో సమావేశం జరుగుతందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు, జి ఈశ్వరయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి సుబ్రహ్మణ్యం, కేసీ బాదుల్లా, జి వలరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 95.92 శాతం


రెడ్డెమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివశంకర్

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. మొత్తం 2,69,191 పింఛన్లకు మొత్తం రూ 79,61,85,000 నగదును అందజేయాలి. ఆ ప్రకారం మూడో రోజైన ఆదివారం సాయంత్రానికి 2,58,203 పింఛన్లకు రూ 76,37,79,500 నగదును అందజేశారు. దీంతో పింఛన్ల పంపిణీ 95.92 శాతం నమోదైంది. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ వేగంగా సాగడం పట్ల పండుటాకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మైదుకూరు డీఎస్పీ బదిలీ


వంశీధర్ గౌడ్

కడప అర్బన్: వైఎస్‌ఆర్ జిల్లాలో మైదుకూరు డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.ఆర్ వంశీధర్ గౌడ్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్–2 ఏసీపీగా బదిలీ చేశారు. ఈయన గతంలో వైఎస్‌ఆర్ జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా పనిచేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ –2 ఏసీపీగా పనిచేస్తున్న టి. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర డీజీపీ కె.వి రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిత

బి.కోడూరు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, విద్యార్థుల చదువే తల్లిదండ్రులకు ఆస్తి అని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరంప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించి అక్కడ జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను, విద్యార్థులకు అందుతున్న వసతులను, భోజన సదుపాయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11 నుంచి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 11,12,13 తేదీల్లో చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధి కారి మహేశ్వరెడ్డి తెలిపారు. ఈ పోటీలకు వైఎస్సార్ జిల్లా నుంచి 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. గత నెల 11,12 తేదీల్లో బద్వేల్ ప్రభుత్వ బాలుర హైస్కూల్లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన 14 మందిని జ్యూరీ సభ్యులు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. ఎంపికైన ప్రాజెక్టులను ఈనెల 11,12,13 తేదీల్లో పలమనేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ఈ 14 మంది విద్యార్థులు గైర్హాజర వ్వడానికి వీలులేదని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారని ఆయన చెప్పారు. ఈ పోటీలకు ఎలా వెళ్లాలి.. ఏమేమి తీసుకెళ్లాలి అనే విషయాల కోసం 9441035830 నంబరులో సంప్రదించాలని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారు..

విద్యార్థిపేరు	స్కూల్‌పేరు	మండలం
సాత్విక్	జెడ్పీ హైస్కూల్	చాపాడు
గణేష్	జెడ్పీ హైస్కూల్	చక్రాయపేట
చరణ్	జెడ్పీ హైస్కూల్	చాపాడు
ఆసిఫా	డిల్లీ పబ్లిక్ స్కూల్	చాపాడు
చాతుర్య	ఎస్‌కే సిబిఎస్‌ఇ	ప్రొద్దుటూరు
రుగ్వేత	జెడ్పీ హైస్కూల్	కమలాపురం
హితేన్‌జైన్	నాగార్జున హెచ్‌ఎస్	కడప
అభిలాష్	నాగార్జున హెచ్‌ఎస్	కడప
సోఫియా	నిర్మల హైస్కూల్	కడప
గైతమి	యూపీ స్కూల్	కొండాపురం
బండి ప్రగతి	జెడ్పీ హైస్కూల్	లింగాల
షర్మీ	విద్యాధరి హెచ్‌ఎస్	పులివెందుల
నిత్యపూజయ్య	నలంద హెచ్‌ఎస్	సిద్ధవటం
అభిలాష్	జెడ్పీ హెచ్‌ఎస్	సిద్ధవటం

ఆదర్శ పాఠశాలలు

- ఇంగ్లీషు మీడియం బోధనతో మంచి ఫలితాలు
- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 31 దరఖాస్తుకు చివరి గడువు



వల్లూరు ఏపీ మోడల్ స్కూల్

వల్లూరు: నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లీషుభాషపై పట్టు తప్పని సరిగా మారింది. ఆంగ్లంపై పూర్తి స్థాయిలో పట్టు ఉన్నవారే ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగాలను సొంతం చేసుకుంటున్నారు. ప్రతిభ ఉన్నా ఆంగ్లంలో పట్టు లేక పోడం వల్ల మిగిలిన వారు చాలావరకు చిరుద్యోగులుగా, నిరుద్యోగులుగా నిలిచిపోతున్నారు. పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలనే ధ్యేయంతో నాడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మోడల్ స్కూళ్ల ఏర్పాటుకు అంకురార్పణ చేశారు. 2009లో మన రాష్ట్రంలో మొత్తం 747 మోడల్ స్కూళ్లను ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొందారు. విద్యకు సమున్నత ప్రాధాన్యత నిచ్చిన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14 సంవత్సరాల క్రితమే పూర్తి స్థాయి ఇంగ్లీషు మీడియం బోధనతో ఏర్పాటు చేసిన మోడల్ స్కూళ్లు నేడు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి. ఈ పాఠశాలల్లో చదివిన వేలాది మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత విద్య అభ్యసిస్తుండటం గమనార్హం. ఆదర్శ పాఠశాలల్లో ఆరోతరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఇంగ్లీషు మీడియం విద్యను అందించడంతో పాటు ఉచి తంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు కార్పొరేట్ తరహా హాస్టల్ వసతిని ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇవి ప్రారంభం నుంచి గ్రామీణ పేద విద్యార్థులకు వరంగా మారింది. ఇక్కడ చదివిన వారు ఎంసెట్, నీట్, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధిస్తూ తమ కలలను సాకారం చేసుకుంటున్నారు.

- ఇంగ్లీషు మీడియంతో సత్ఫలితాలను సాధిస్తున్న ఈ పాఠశాలల్లో అడ్మిషన్ పొందడం గగనంగా మారుతోంది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీషు మీడియంలో ఈ స్థాయి విద్యను అభ్యసించడానికి ప్రైవేటు పాఠశాలల్లో లక్షలాది రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుందని ప్రజలు , విద్యావేత్తలు అభిప్రాయప పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు పెట్టినా అందుబాటులో లేని నాణ్యమైన ఇంగ్లీషు మీడియం విద్య ఇక్కడ లభిస్తుండటం పేదలకు వరంగా మారింది. ఇందులో సీటు పొందడంలో తీవ్ర పోటీ నెలకొంటోంది. ఈ పాఠశాలల్లో సుశిక్షితులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించారు.

వైఎస్‌ఆర్ జిల్లాలోని ఏపీ మోడల్ స్కూళ్లు..
జిల్లాల విభజనకు ముందు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 10 ఏపీ మోడల్ స్కూళ్లు ఉండగా జిల్లా విభజన తరువాత వైఎస్‌ఆర్ జిల్లాలో మూడు స్కూళ్లు మాత్రమే మిగిలాయి, అవి వల్లూరు, ఖాజీపేట, శ్రీ అవధూత కాశినాయన మండలాల్లో ఉన్నాయి.

అన్నమయ్య జిల్లాలో..
అన్నమయ్య జిల్లాలో 17 ఏపీ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. చిన్నమండ్యం, సంబేపల్లె, రామాపురం, పెనగలూరు, రాయచోటి, పుల్లంపేట , లక్కిరెడ్డిపల్లె, రామ సముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, కొత్త కోట, ములకల చెరువు, తంబళ్లపల్లె, పీటీఎమ్, పెద్ద మండ్యం, కలకడ, కేవీపల్లె మండలాల్లో ఏపీ మోడల్ స్కూళ్లు వున్నాయి.

31 వరకు దరఖాస్తుల స్వీకరణ
ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 21 వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం ఈ నె 3వ తేదీ నుంచి 31 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు: ఓసీ, బీసీ విద్యార్థులు 01-09-2012 నుంచి 31-08-2014 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01-09-2010 నుంచి 31-08-2014 మధ్య జన్మించి ఉండాలి. సంబంధిత జిల్లాలో ఏదేని ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2022-23, 2023- 24 విద్యా సంవత్సరాల్లో చదివి, 2023- 24 విద్యా సంవత్సరంలో 5 వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత కలిగి వుండాలి.

పరీక్ష ఫీజు వివరాలు: ఎస్సీ, ఎస్టీలకు రూ 75, ఓసీ, బీసీలకు రూ. 150

సౌకర్యాలివి..
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్
- కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా 5 ఎకరాల సువిశాల ప్రాంగణాలతో రెండస్తుల భవనాలు కలిగి ఉన్నాయి.
- ఆరు నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీషు మీడియంలోనే విద్యా బోధన
- విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఉచిత విద్య
- స్పోకెన్ ఇంగ్లీషు, చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ
- అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం
- ఆధునిక సౌకర్యాలు, పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు
- ఎల్‌సీడీ ప్రొజెక్టర్‌తో విద్యా బోధన, డిజిటల్ విద్యా బోధనకు అవకాశం
- శారీరక , మానసిక ఉల్లాసం కోసం యోగా, క్రీడా కార్యక్రమాల నిర్వహణ
- ప్రతి పాఠశాలలో 100 మంది బాలికలకు కార్పొరేట్ హంగులతో హాస్టల్ వసతి
- 9వ తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు

అందుబాటులోని తరగతులు: 6 నుంచి ఇంటర్ మీడియట్ వరకు
మీడియం: ఇంగ్లీషు మీడియం
సెక్షన్‌లు: 10 వ తరగతి వరకు ఒక్కో తరగతికి రెండు సెక్షన్‌లు
అందుబాటులోని సీట్ల సంఖ్య: సెక్షన్‌కు 40 మంది చొప్పున తరగతికి 80 మంది
ఎంపిక ఇలా: ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్‌లను అనుసరించి సీట్లను కేటాయిస్తారు.

ప్రవేశ పరీక్ష: 5వ తరగతి స్థాయిలో ఆబ్జెక్టివ్ విధానంలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఇందులో ఓసీ, బీసీ విద్యార్థులకు 35, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 కనీస మార్కులుగా నిర్ణయించారు.

దరఖాస్తు చేసుకోవాలి



ఏపీ మోడల్ స్కూళ్లలో కార్పొరేట్‌కు మించిన విద్యా బోధన లభిస్తోంది. నిరుపేద విద్యార్థులు కూడా ఉచిత ఇంగ్లీషు మీడియం విద్యను పొందడానికి ఇది చక్కటి అవకాశం. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.
-సీ.దిలీప్ కుమార్, ప్రిన్సిపల్, ఏపీ మోడల్ స్కూల్, సంబేపల్లె, అన్నమయ్య జిల్లా

ఉజ్వల భవిష్యత్ ఉంటుంది



గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించాలనే ధ్యేయంతో ఏపీ మోడల్ స్కూళ్లను పూర్తిగా ఇంగ్లీషు మీడియంలో ప్రారంభించడం జరిగింది. 6 వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 31 వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీటిల్లో ప్రవేశం పొందితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.
-ఎమ్ సురేష్ బాబు, ప్రిన్సిపల్, ఏపీ మోడల్ స్కూల్ , వల్లూరు, వైఎస్‌ఆర్ జిల్లా

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డి సర్కిల్: ఈనెల 8వ తేదీన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు వెళ్లేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోందని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి జిల్లాలోని వివిధ డిపో మేనేజర్లు, అధికారులతో గూగుల్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శైవ క్షేత్రాలకు ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం నుంచి 9వ తేదీ వరకు బస్సులు నడుస్తాయన్నారు. కడప డిపో నుంచి పొలతలకు 80, నిత్యపూజ కోనకు 35 బస్సులు నడుపుతామన్నారు. పులివెందుల డిపో నుంచి పొలతలకు 30, భానుకోట 05, బద్వేలు డిపో నుంచి లంకమల 25, బి.మఠం 5, మల్లెంకొండ 5, పోరుమామిళ్ల ఎస్ఎస్ మఠంకు 5 బస్సులు నడుస్తాయన్నారు. అలాగే మైదుకూరు డిపో నుంచి లంకమల 15, జ్యోతి (సావిశెట్టిపల్లె) 5, పోరుమామిళ్ల జ్యోతి 6, బి.మఠం 15 బస్సులు, ప్రొద్దుటూరు డిపో నుంచి పొలతల 15, ఎర్రగుంట్ల సంగమేశ్వర దేవళాలు 4, అల్లాడుపల్లె దేవళాలు 10, కన్యతీర్థంకు 6 బస్సులు, జమ్మలమడుగు డిపో నుంచి అగస్త్యేశ్వరకోన 8, కన్యతీర్థంకు 2 బస్సులు కలిపి మొత్తం 276 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన సూచించారు. అలాగే ఈనెల 11వ తేదీన జరిగే గంగమ్మ జాతకు కడప నుంచి 30, పులివెందుల నుంచి 30 బస్సులు నడుపుతామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 24న పౌర్ణమి సందర్భంగా తిరువన్నామలై అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు.

పోలియోరహిత సమాజం కోసం కృషి

కలెక్టర్ విజయరామరాజు


చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్

కడప రూరల్: పోలియో రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం కడప గాంధీనగర్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో జిల్లా కలెక్టర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తోపాటు కడప నగర కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్, ఆర్డీవో మధుసూదన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు హాజరై చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ రికార్డుల ప్రకారం 0–5 సంవత్సరాలలోపు చిన్నారులు జిల్లా వ్యాప్తంగా 2,28,131 మంది ఉన్నారని, వీరిలో ఏ ఒక్కరూ మిస్ అవకుండా పోలియో చుక్కలు వేసేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాకు 3,04,900 పల్స్ పోలియో డోసులను తెప్పించామన్నారు. ఇందు కోసం 2029 పబ్లిక్ బూత్ లు, 51 మొబైల్ బూత్ లు, 23 ట్రాన్సిస్ట్ బూత్ లను ఏర్పాటు చేసి.. 8,467 మంది వ్యాక్సినేటర్లను సిద్ధంగా ఉంచామన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

కడప సెవెన్‌రోడ్స్: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళిని పాటించడంతో పాటు ఎన్నికల వ్యయాన్ని పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల వ్యయంపై నిర్వహించే రికార్డులు, అకౌంట్స్, ఎంసీసీ, ఎంసీఎంసి, సువిధ, సి–విజిల్ లాంటి వివిధ ఐటీ అప్లికేషన్స్‌పై రాజకీయపార్టీల ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జేసి గణేష్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు ఎంపీకి పోటీ చేయు అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యేకు రూ.40 లక్షల ఖర్చు మించరాదన్నారు. నామినేషన్ వేసిన రోజు నుంచి డేట్ ఆఫ్ డిక్లరేషన్ వరకు తన ఎన్నికల ఖర్చును సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేసి నిర్ణీత సమయంలో వ్యయ అధికారులకు చూపించాలన్నారు. రానున్న ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మనమందరం కృషి చేద్దామన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు.

కడపకు రూ.400కోట్లతో తాగునీటి పైపులైన్


- ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- రూ.2.16కోట్లతో అక్కాయపల్లె పార్కు, శాస్త్రినగర పార్కు, అక్కాయపల్లె ప్లాజాల ప్రారంభం


శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరానికి తాగునీరు అందించేందుకు రూ.400 కోట్లతో పైపులైన్ పనులకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తామని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ ఆధ్వర్యంలో స్థానిక అక్కాయ పల్లె పార్కు, అక్కాయ పల్లి ప్లాజా, శాస్త్రి నగర్ పార్కులను ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా, కడప నగర మేయర్ కే. సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. శిలాఫలాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత కోవిడ్ వల్ల రెండు సంవత్సరాల విలువైన సమయాన్ని మనం కోల్పోయామన్నారు. మిగిలిన ఈ మూడేళ్లలో జిల్లాలో, కడపలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలు గమనించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కడప నగరానికి 14వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు తప్ప అభివృద్ధి చేయడానికి ఒక్క రూపాయి కూడా నిధులు కూడా ఇవ్వలేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో వందల కోట్లు వెచ్చించి పెద్ద ఎత్తున రోడ్డు విస్తరణ, కూడళ్ల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, వరదనీటి కాలువలు నిర్మిస్తున్నామన్నారు. ఆరోగ్య విషయంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రిమ్స్ హాస్పిటల్ నిర్మిస్తే, జగనన్న ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సైకియాట్రిక్ సెంటర్, క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ కూడా శంకుస్థాపన చేసి, ఇటీవలే నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు కూడా చేశారని గుర్తు చేశారు. ఒక్క క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ మిషనరీకే రూ.100 కోట్లకు పైగా జగనన్న ప్రభుత్వం వెచ్చిస్తోందని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న మంచిని, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలు గమనించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ స్థలాన్ని ఆ పార్టీ కార్యాలయానికి కేటాయిస్తూ జీవో ఇచ్చారని, దీనిపై స్థానిక కార్పొరేటర్, మేయర్ కోర్టుకు వెళ్లి ఆ జీవోను రద్దు చేయించి, జగనన్న ప్రభుత్వం రాగానే మంచి పార్కు నిర్మించి ప్రజలకు అంకితం చేసినట్లు చెప్పారు. తొలుత వారు పార్కును ప్రారంభించి, ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జిమ్ చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక పరికరాలను. పాత్ వేను పరిశీలించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, వేణు గోపాల్ నాయక్, దేవిరెడ్డి ఆదిత్య, చల్లా రాజశేఖర్, ఐస్‌క్రీం రవి, షఫీవుల్లా పాల్గొన్నారు.

కంట్లో నలుసులా ఆది!

- జమ్మలమడుగు, ప్రొద్దుటూరు స్థానాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ
- ఎన్నికల పొత్తు ఉన్నా.. లేకున్నా పోటీలో ఉంటానని ప్రకటన
- ఆ రెండు నియోజకవర్గాల టీడీపీ నేతలల్లో అలజడి



సాక్షిప్రతినిధి, కడప: రాజకీయ ఉనికి కోసం మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి ఆరాటపడుతున్నారా..! ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోతే కనుమరుగు అవుతామనే అభద్రతాభావం వెంటాడుతోందా? అంటే అవుననే అభిప్రాయాన్ని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆ మేరకే ఎన్నికల పొత్తు ఆసరాగా పోటీ చేయాలనే తపనలో ఉన్నట్లు సమాచారం. గెలుపోటములు దేవుడెరుగు ప్రత్యక్ష ఎన్నికల చట్రంలో నిలవాలనే దిశగా అడుగులు పడుతున్నాయి. దీంతో రెండు నియోజవర్గాల టీడీపీ నేతల కంట్లో నలుసులా తయారయ్యారు. ఎన్నికల పొత్తు ఉన్నా లేకున్నా జమ్మలమడుగు నుంచి పోటీ చేస్తానంటూనే, బీజేపీ ఆదేశిస్తే ప్రొద్దుటూరు, కడప పార్లమెంట్‌కు సైతం పోటీ చేస్తానని ఇటీవల బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి ప్రకటించారు. ఇప్పటికే టీడీపీ టికెట్ ఖరారైందని భావిస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆయా ఇన్‌చార్జిలకు ఆది ప్రకటన లోలోన గుబులు రేపుతోంది. హడావుడి ప్రారంభం అయ్యే వరకు ఎన్నికల ఊసే ఎత్తని ఆయన రాజకీయ పొత్తులో భాగంగా లబ్ధి పొందాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

వారసుడంటూనే..సైంధవుడిలా అడ్డగింత..
తన రాజకీయ వారసుడు అన్న కుమారుడు భూపేష్‌రెడ్డి అంటూ 2009 ఎన్నికల్లో ప్రకటించిన ఆదినారాయణరెడ్డి ఆపై సైంధవుడి వలే అడ్డుకుంటున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. 2014లో భూపేష్ పోటీ చేస్తారని ప్రకటించారు. ఆ ప్రకటన కాస్తా 2019 పోస్ట్‌పోన్ అయింది. ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత శరవేగంగా బీజేపీలో చేరిపోయారు. ఇక ఆదితో అడ్డు ఉండదని భావించి ఏడాది క్రితం టీడీపీ ఇన్‌చార్జి బాధ్యతలను భూపేష్‌రెడ్డి తన భుజస్కందాలపై వేసుకున్నారు. టీడీపీ టికెట్ దాదాపు ఖరారైందనే భావనలో ఉండగా మరోమారు నిలువరించే ప్రయత్నంలో ఆదినారాయణరెడ్డి నిమగ్నమయ్యారు. ఎన్నికల పొత్తులో భాగంగా జమ్మలమడుగు స్థానం బీజేపీకి కేటాయించాలనే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆది చర్యలు దేవగుడి కుటుంబంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. భూపేష్ నాయకత్వాన్ని కాపాడుకునే ప్రయత్నంలో మెజార్టీ కుటుంబ సభ్యులు మద్దతుగా నిలుస్తున్నారు. ఇలాంటి పరిస్థితి అంచనా వేసిన ఆది ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కాలు పెట్టేందుకు కూడా రెడీ అయ్యారని పరిశీలకులు భావిస్తున్నారు.

ప్రొద్దుటూరులోనూ అలజడి
ప్రొద్దుటూరు టీడీపీ టికెట్ కోసం నలుగురు పోటీ పడుతున్నారు. ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడు ఆశిస్తున్నారు. ఎవరికి వారు తామే అభ్యర్థిగా చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో ఆ సీటుపై బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి కన్ను పడింది. రొట్టె కోసం రెండు పిల్లులు పోట్లాడుతుంటే, కోతి వచ్చి రొట్టె ఎత్తుకెళ్లినట్లు కథల్లో చదువుకున్నాం కదా... అచ్చం అలాగే ఎన్నికల పొత్తులో భాగంగా బీజేపీకి ప్రొద్దుటూరు సీటు కేటాయించాలని ఆదినారాయణరెడ్డి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ ఎత్తుగడల్లో దిట్టగా పేరున్న ఆదినారాయణరెడ్డి కుయుక్తులు కలిసి వస్తాయో...లేక బెడిసి కొడతాయో వేచిచూడాల్సిందే!

ఎంపీని కలిసిన సతీష్‌రెడ్డి


ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో చర్చిస్తున్న సతీష్‌రెడ్డి

పులివెందుల: పులివెందులలో ఆదివారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని శాసనమండలి మాజీ డిప్యూటీ ఛైర్మెన్ ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని దివంగత డా.ఇ.సి.గంగిరెడ్డి నివాసంలో ఆయన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డిలను కలిశారు. గత రెండు రోజుల క్రితం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సతీష్‌రెడ్డి వైయస్సార్‌సీపీలో చేరిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం వారి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా వారి మధ్య పులివెందుల నియోజకవర్గం, అలాగే కడప జిల్లాలో పార్టీ పటిష్టతకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఎలాంటి కార్యాచరణ చేపట్టాలి అనే విషయాల గురించి చర్చించినట్లు సమాచారం. అంతకు ముందు ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డిని సతీష్‌రెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

- కోవిడ్ సమయంలో వైద్యులు అందించిన సేవలు అమూల్యం
- వైద్యుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళతా
- వైద్యుల ఆత్మీయ సమావేశంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : పేదల ఆరోగ్యం విషయంలో ఎంత వ్యయం చేసేందుకైనా జగనన్న ప్రభుత్వం సిద్ధంగా ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఐఎంఏ హాలులో డాక్టర్ దేవిరెడ్డి చైతన్య రెడ్డి అధ్యక్షతన వైద్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ వైద్యులు దైవంతో సమానమని, దేవుడు జన్మనిస్తే.. ఆపదలో ఉన్నవారికి వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. అందుకే వైద్యుల మాటకు ఎంతో విలువ ఉంటుందన్నారు. తమ కుటుంబంలో కూడా చాలామంది వైద్యులు ఉన్నారని, వైద్యుల సమస్యల పట్ల తనకు కూడా అవగాహన ఉందన్నారు. జగనన్న ప్రభుత్వంలో 15 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు వైద్యులు ఉన్నారంటే ఆ కమ్యూనిటీకి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చన్నారు. ఆరోగ్యశ్రీని ప్రభుత్వం అంకిత భావంతో అమలు చేస్తోందన్నారు. అందులో అందించే వైద్యం ఖర్చును రూ.2లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచారన్నారు. దివంగత వైఎస్సార్ రిమ్స్ హాస్పిటల్ నిర్మిస్తే, జగనన్న ప్రభుత్వం ఏర్పడ్డాక సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, కేన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాల, పుష్పగిరి, ఎల్వీప్రసాద్ ఐ హాస్పిటల్స్ నిర్మించారని, తద్వారా కడపను హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. రెండేళ్ల కోవిడ్‌తో ప్రపంచం అల్లాడిపోయినా సీఎం వైఎస్ జగన్ ప్రజలకు ఎలా మేలు చేయాలని ఆలోచించారే తప్పా ఆ సాకు చెప్పి తప్పించుకోవాలని చూడలేదని గుర్తు చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వైద్య, ఆరోగ్య శాఖలో 56వేల పోస్టులు భర్తీ చేశారన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కోవిడ్ సమయంలో వైద్యులు అందించిన విశేష సేవల వల్లే రాష్ట్రంలో మరణాల శాతాన్ని తగ్గించగలిగామని చెప్పారు. జగనన్న ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం విప్లవాత్మకమన్నారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ వైద్యులు ప్రాణదాతలతో సమానమన్నారు. మేధావులైన వైద్యులు వాస్తవాలను ప్రజలకు తెలియజేసి జగనన్న ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరారు. బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ మాట్లాడుతూ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీహెచ్‌ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి, డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ సొహైల్, పెనుబాల విజయ్ కుమార్, డాక్టర్ శివానాయక్, అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను సన్మానిస్తున్న బీసీ నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించి వారందరికీ సామాజిక న్యాయం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాలన కాలంలో పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. బీసీలకు తన ప్రభుత్వంలో సామాజిక న్యాయం పాటిస్తూ ప్రభుత్వంలో భాగస్వామ్యం చేశారన్నారు. అనేక మందికి కేబినెట్ హోదా కల్పిస్తూ, చైర్మన్ పదవులు, నామినేటెడ్ పదవులు కేటాయించారన్నారు. పార్టీలో ఎవరు పోయినా ఎవరు ఉన్నా సామాజిక న్యాయం పాటిస్తానని చెప్పి జగనన్న నరసరావు పేట ఎంపీగా ఉన్న లావు కృష్ణదేవరాయలును తప్పించి అనిల్‌కుమార్ యాదవ్‌కు టికెట్ ఇచ్చారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో చంద్రబాబు నాయుడు బీసీలకు మోసం చేశారన్నారు. అంతే కాకుండా ఎస్సీలను కించపరుస్తూ ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చెప్పారన్నారు. అలాగే బీసీలను ఉద్దేశించి తోక జాడిస్తే తోక కత్తిరిస్తా అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు అని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం చేస్తూ అక్కున చేర్చుకుంటున్నారని తెలిపారు. బీసీల కోసం కడపలో రూ. 6 కోట్లు వెచ్చించి బీసీ భవన్ నిర్మించనున్నామని తెలిపారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెల్పుల శివమ్మ, జెడ్పీటీసీ మహాలక్ష్మీ, రామాంజనేయ యాదవ్, నాగేంద్ర యాదవ్, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మైనార్టీల అభివృద్ధి

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి
- కొండపేటలో 300 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మైనార్టీల ఆర్థికాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు, మండలంలోని కొండపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 300 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో 100 కుటుంబాల వారు మైనార్టీలు కాగా, 100 కుటుంబాలు ఎస్సీ, 20 కుటుంబాలు మేదర, 30 కుటుంబాలు యాదవులు, 10 కుటుంబాలు దూదేకుల, 20 కుటుంబాలు రజక, 20 కుటుంబాలు ఓసీలు ఉన్నారు. వీరందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం వల్లనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి నేడు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో మూడోసారి రవీంద్రనాథ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే కొండపేటలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్‌ఆర్, ఎంపీటీసీ నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పీసీ కేశవరెడ్డి, కిరణ్, ఆర్కే ఆర్, ఖాజాపీర్, మాబు, ఖాజా, ఖలీల్, షేక్షా, అజంతుల్లా, షరీఫ్, అలా ప్రకాష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

కల నెరవేరింది



మాది సామాన్య కుటుంబం. మదనపల్లె పట్టణం పీ అండ్ టీ కాలనీలో నివాసమున్నాం. బాడుగ ఇంటిలో ఉన్నాం. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇంటి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా రాలేదు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడంతో నాకు కోళ్లబైలులో ఇల్లు మంజూరు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నాం.

–నూరున్నీసా, పీ అండ్ టీ కాలనీ, మదనపల్లె

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



మా పిల్లలకు గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను తయారు చేయించారు. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారుల ద్వారా నాకు సర్టిఫికెట్లను అందజేశారు. సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా జగనన్న సురక్ష కార్యక్రమంలో సరిఫికెట్లు వచ్చాయి.

–మందపల్లి రామయ్య, గాంధీవీధి, సిద్దవటం

నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించే విధంగా నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారు. అలాగే విద్యార్థులకు ఉన్నతమైన బోధనలు అందించే విధంగా పాఠశాలలో ఉపాధ్యాయులందరిని నియమించి పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల తల్లులకు ప్రభుత్వ పథకాలు అందిస్తూ పుస్తకాలు, యూనిఫామ్‌లు అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

– సురేష్‌రెడ్డి, ఉపాధ్యాయుడు, పులివెందుల

పీఎఫ్ఐ కార్యదర్శి అరెస్టుపై అంతటా చర్చలు

మైదుకూరు : మైదుకూరు మండలం చెర్లోపల్లెలో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సంస్థ కార్యదర్శి అబ్దుల్ సలీంను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేయడం మైదుకూరు అంతటా చర్చనీయాంశమైంది. మండలంలోని చెర్లోపల్లె మసీదులో తలదాచుకుంటున్న అబ్దుల్ సలీంను శనివారం ఎన్ఐఏ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. చెర్లోపల్లె గ్రామస్తులు తమ గ్రామంలో నిషేధిత సంస్థకు చెందిన తీవ్రవాది తలదాచుకున్న విషయం తెలుసుకొని ఒకింత ఉలికిపాటుకు గురవుతున్నారు.

అగంతుకుని సిఫారసుతో అబ్దుల్ సలీం 25 రోజుల కిందట చెర్లోపల్లె చేరుకున్నట్టు తెలుస్తోంది. అతన్ని మసీదులో ఉంచిన గ్రామానికి చెందిన వ్యక్తి వంట సామాను, స్టౌ ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అబ్దుల్ సలీం చెర్లోపల్లెలో ఉన్నట్టు తెలుసుకున్న ఎన్ఐఏ అతన్ని అరెస్టు చేసిన అనంతరం అతన్ని మసీదులో ఉంచిన గ్రామానికి చెందిన వ్యక్తిని కూడా తీసుకెళ్లి విచారిస్తున్నట్టు సమాచారం.

పొలాల్లో దొంగల బెడద

ఖాజీపేట : వర్షాలు లేవు.. భూగర్భజలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి. ఈ సమయంలో సాగులోని పంటలను కాపాడుకుందాం అనుకుంటే పొలాల్లో దొంగల బెడద అధికమై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాజీపేట మండలంలోని తుడుమలదిన్నె, సుంకేశుల గ్రామంలో రైతుల పొలాల్లో వరుసగా 6 చోట్ల చోరీ జరిగింది. సాగుచేస్తున్న పంట పొలాల్లో దొంగలు పడి పొలంలోని స్టార్టర్లు, వైర్లను చోరీ చేశారు. విషయం గమనించిన స్థానిక రైతులు ఖాజీపేట సీఐ రామాంజులుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో కూడా ఇలాగే రైతుల పొలాల్లో దొంగలు పడి స్టార్టర్లు, వైర్లను చోరీ చేశారని తెలిపారు. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ చోరీలు జరుగుతున్నాయని అంటున్నారు. పంటలు బాగా చేతికి అందే సమయంలో ఇలా దొంగలు పడి చోరీలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దొంగల బెడద నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీకి అండగా నూర్‌బాష్, దూదేకులు

ఆత్మీయ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నూర్‌బాష్, దూదేకులు అండగా నిలవడం ఎంతో సంతోషాన్నిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో నూర్‌బాష్, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో అన్ని ప్రభుత్వాలు నూర్‌బాష్, దూదేకులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని, ఆ తర్వాత వదిలేసే పరిస్థితి ఉండేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నూర్‌బాష్, దూదేకుల కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేశారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత 136 కులాలుగా ఉన్న బీసీలకు 56 ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, అందులో దూదేకుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పరిచారన్నారు. ఏలూరు మేయర్ స్థానాన్ని దూదేకులకు ఇవ్వడమే గాక, రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల నూర్‌బాష్, దూదేకులకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. ప్రతి కుటుంబానికి మేలు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దూదేకులు మద్దతు ఇచ్చి, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓ. రసూల్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా మాట్లాడుతూ నూర్‌బాష్, దూదేకులు గతంలో తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉండేవారని, ఆ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుందే తప్పా ఎలాంటి మేలు చేయలేదన్నారు. దూదేకులకు కడపలో రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, బీసీ కార్పొరేషన్‌లో ఉన్న నూర్‌బాష్, దూదేకులను మైనార్టీ కార్పొరేషన్‌లో కలపాలన్నారు. టీడీపీ నాయకులు తాము ఏం అభివృద్ధి చేశారో చెప్పి ఓట్లు అడగాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని, కడప ఎమ్మెల్యేగా అంజద్‌బాషాను అత్యధిక మెజారీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు పెద్దన్న, అబ్దుల్ సుభాన్, అక్బర్ అలీ, కుల్లాయప్ప, రజియా బేగం, జహీరా బాను, ఇమాం బాషా, ఖాదర్‌వలీ, రహంతుల్లా పాల్గొన్నారు.

త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవం చూతము రారండి.!

- నేటి నుంచి హత్యరాలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 12వ తేదీ వరకు 9 రోజులపాటు వైభవంగా నిర్వహణ
- 8న శివరాత్రి, 9న కల్యాణం, 10న రథోత్సవం
- వేల సంఖ్యలో దర్శించుకోనున్న భక్తులు
- భక్తుల సౌకర్యం కోసం సర్వం సిద్ధం చేస్తున్న అధికారులు


శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం (ఫైల్)

రాజంపేట రూరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రాలలో ఒకటయిన హత్యరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల4వ తేదీ సోమవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలు 4 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతాయి. జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న హత్యరాల బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సంస్థ 7,8,9 తేదీలలో పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ పాతబస్టాండు నుంచి హత్యరాలకు, చిట్వేలి నుంచి హత్యరాలకు ఆర్టీసీ డీఎం సి.రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా ఆర్‌డీఓ మోహన్‌రావు, తహసీల్దార్ ఆర్.ఇన్‌బనాదన్, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, ఈఓ జి.కొండారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, రూరల్ సీఐ రవీంద్రలతో సమావేశమై భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే సమయంలో డీఎస్పీ చైతన్య పర్యవేక్షణలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో శాంతిభద్రలపై చర్యలను చేపడుతున్నారు. విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.రాజశేఖరరెడ్డి, డీఈఈ ఎస్ సురేంద్రనాథ్‌ల ఆధ్వర్యంలో అత్తిరాలలో విద్యుత్ పనులు శరవేగంగా చేపడుతున్నారు. బహుదానది తీరం వెంబడి బారికేడ్లను ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు స్నానం చేసేందుకు స్నాన ఘట్టాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో 8వ తేదీ శివరాత్రి సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు. అదే విధంగా హత్యరాలలో జాగారం జరిగే రోజు పెద్ద ఎత్తున స్వామి వారి హరికథా కాలక్షేపానికి అధిక ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజుల పాటు పెద్ద ఎత్తున భక్తులు, సంఘసేవకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు భక్తులకు అన్నదానాలు, మజ్జిగ, మంచినీటి సరఫరా వంటి కార్యక్రమాలు విరివిగా చేపట్టనున్నారు.

8వ తేదీ శివరాత్రి..

8వ తేదీ శుక్రవారం శివరాత్రిని పురస్కరించుకొని వేకువజామునుంచే స్వామి వారి దర్శన సౌకర్యం కల్పించనున్నారు. అదే విధంగా కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఉదయం 10 గంటలకు కపాలేశ్వర ఉత్సవం, రాత్రి 6 గంటలకు శిఖరదీపారాధన, 9 గంటలకు లింగార్చన, 12 గంటలకు లింగోద్భారణ, 01 గంటకు నంది ఉత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

9వ తేదీ కల్యాణం..

శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణం శనివారం 9వ తేదీ ఉదయం 9.20 గంటల నుంచి 10 గంటల 20 నిమిషాల వరకు వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు పెళ్లికొడుకు గుర్రపు వాహనం, 11 గంటలకు గజవాహనం మీద దేవదేవేరిలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

10వ తేదీ రథోత్సవం..

10వ తేదీ ఆదివారం ఉదయం 09 గంటలకు రథోత్సవం పురవీధులలో వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 8గంటలకు హనుమంతవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు.

గుండ్లూరు, ఊటుకూరులలో..

మండలంలోని గుండ్లూరులో శ్రీ కామాక్షి సమేత శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే అన్నమయ్య పూజలు చేసిన ఊటుకూరులోని శ్రీకామాక్షి సమేత శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు.

ట్రాక్టర్ ఢీ కొని విద్యార్థిని మృతి

నందలూరు(రాజంపేట): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీ కొని స్కూటీపై వెళ్తున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని మృతి చెందింది. మండలంలోని పాటూరు పంచాయతీ, నబీకోటకు చెందిన చింతామణి చంద్రశేఖర్, శివరాణి దంపతుల మూడో కుమార్తె శ్రీ విద్య (17) నందలూరు వైపు వస్తుండగా అదే వైపు కంకర తీసుకు వస్తున్న ట్రాక్టర్ నాగిరెడ్డిపల్లె శివార్లలో ఢీ కొంది. శ్రీ విద్య తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

కండువాలు వేసి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరం రవీంద్రనగర్‌లో 41, 42, 43 డివిజన్ల పరిధిలోని 50 కుటుంబాల వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం స్థానిక కిరణ్ బార్ వద్ద డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వారిని పేరు పేరునా పలకరించి, కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ఎన్నికల హామీలు పక్కాగా అమలు చేసిన జగనన్న పాలన చూసి అత్యధిక సంఖ్యలో యువత వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. ప్రస్తుత సంక్షేమ పథకాలన్నీ మున్ముందు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని వారు బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ఖాజా, ఫయాజ్, చాను, సలాం, మస్తాన్, ఇబ్రహీం, కరీం, ఫరూఖ్, గౌస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, మాజీ కార్పొరేటర్ జమాల్ వలీ, ఎన్‌ఆర్‌ఐ గయాజ్, చల్లా రాజశేఖర్, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు చేరిక


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని స్వాగతిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని రోడ్డు కృష్ణాపురం గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, 50 కుటుంబాల కార్యకర్తలు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

రోడ్డు కృష్ణాపురం గ్రామానికి చెందిన ఐఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న ప్రజారంజక పాలనను చూసి అందరూ ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో అయ్యం సుబ్బారెడ్డి, నాగం నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, ద్వారకనాథరెడ్డి, రమణమ్మ, కె.కృష్ణారెడ్డి, అమ్మవరం సుదర్శన్ రెడ్డి, దస్తగిరి, పల్లె నాగరాజు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రసాద్ రెడ్డి, నాయకులు వేణుగోపాల్, మాజీ సర్పంచ్ విశ్వనాథరెడ్డి, హవెల్ సుబ్బారెడ్డి, నాగమల్లారెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.